క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



గట్టు: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొత్తం 303 మంది విద్యార్థులకు గాను 302 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, డిపార్టుమెంట్ అధికారి కృష్ణవర్ధన్‌లు తెలిపారు. శుక్రవారం బ్రిడ్జి కోర్సు, ఫిజికల్ సైన్స్ పరీక్షలతో ఇంటర్ పరీక్షలు ముగుస్తాయి.

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 63మంది విద్యార్థులకు గాను 62మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి సత్యనారాయణ తెలిపారు.

సీఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



ఎర్రవల్లిచౌరస్తా: అలంపూర్ వలయాధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఐ రవిబాబును గురువారం ఎర్రవల్లి మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా నాయకులు భాస్కర్‌రెడ్డి, తిమ్మారెడ్డిలు కోదండాపురంలోని సీఐ కార్యాలయంలో ఆయనను కలిసి పూల బొకే, శాలువాతో సత్కరించారు.

గాలికుంటు వ్యాధిని అరికడుదాం

అయిజ: పశువు కు గాలికుంటు వ్యాధి రాకుండా నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న టీకాలు వేయించి వ్యాధిని అరికడదామని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి అన్నారు. గురువారం మండలంలోని మేడికొండలో వెటర్నరీ సిబ్బంది 395 పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ప్రతి ఒక్క పశువుకు తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు.

కుష్ఠువ్యాధిని పారదోలాలి



ధరూరు: కుష్ఠు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అందుకు అందరి సహకారం అవసరమని పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకులు హీర్యానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కుర్వ వీధిలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్ఠ వ్యాధిగ్రస్తులను, లక్షణాలు గల వారిని గుర్తించారు. ఈ నెల 11నుంచి 24వ తేదీ వరకు 14రోజుల పాటు ప్రతి గ్రామంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి రెండేళ్లు పైబడిన వారందని పరీక్షించి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి పంపించి చికిత్స చేయిస్తామన్నారు. ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి 9గంటల లోపు ప్రతి ఇంటిని దర్శించి స్పర్శ లేని వారిని గుర్తించే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమానికి మండల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించ వద్దని సూచించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్త సమిత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యదర్శి అశోక్ బదిలీపై ఇటిక్యాల మండలం గార్లపాడు పంచాయతీకి వెళ్లడంతో, ఆ స్థానంలో ఇటిక్యాల మండల కోదండాపురం నుంచి ఉండవెల్లికి నూతన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి వచ్చారు. ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను మాజీ సర్పంచు రేఖ, పంచాయతీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వెంకట్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిగడపకు మోదీ పథకాలు

గద్వాల రూరల్: ప్రతిగడపకు దేశ ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమాభివృద్ధి పథకాలు తీసుకెళ్లేలా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎల్ఈడీ స్క్రీన్ వాహనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కుమ్మరి శ్రీనివాసులు, చిత్తారి కిరణ్, అనిల్, దాసు, రజక నర్సింహులుపాల్గొన్నారు.

భూసార పరీక్ష కేంద్రాల జాడేదీ?

- 2018లో క్లస్టర్‌కి ఒకటి చొప్పున మంజూరు
- ఉమ్మడి జిల్లాలో కేవలం ఒకే భూసార కేంద్రం
- రైతులు మట్టి పంపడమే కానీ ఫలితాల ఊసేలేదు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



చాగాపురంలో ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: భూసార పరీక్షలపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో పంటలకు అవసరం లేని ఎరువులు, క్రిమి సంహారక మందులను వినియోగిస్తున్నారు. దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోవడమే గాక ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించలేకపోతున్నారు. దీనికి తోడు భూమిలో ప్రతి ఏటా కర్బనశాతం అమాంతం తగ్గిపోతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఒకే భూసార పరీక్ష కేంద్రం ఉండటం వల్ల రైతుల నుంచి సేకరించిన మట్టి నమూనాలను అధికారులు అక్కడికి పంపేవారు. పరీక్ష కేంద్రం నుంచి రిపోర్టు రైతులకు అందేందుకు చాలా సమయం పడుతుండటంతో రైతులు పరీక్షలు చేయించేందుకు ఆసక్తిని చూపడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన గత ప్రభుత్వం ప్రతి క్లస్టర్‌కి ఒకటి చొప్పున మినీ భూసార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2018 లోనే ఆయా క్లస్టర్లలో కేంద్రాలను ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించింది. దీనికి సంబంధించిన కిట్లను కూడా ఆయా క్లస్టర్లకు గతంలోనే సమకూర్చింది. గదుల కొరత, విద్యుత్, తదితర సమస్యల కారణంగా కొన్ని క్లస్టర్లలో ఏర్పాటు చేయలేదు. మరికొన్ని క్లస్టర్లలో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసినా అవి కొద్ది రోజులు మాత్రమే పనిచేశాయి. దీనివల్ల అన్ని క్లస్టర్లలోని కిట్లన్నీ ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి.

పైలెట్ గ్రామాల ఎంపిక..

సేంద్రియ సాగు చేపట్టాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా అవసరం. అలంపూర్ నియోజకవర్గంలో మొత్తం 53 క్లస్టర్లు ఉండగా, ప్రభుత్వం భూసార పరీక్షల కోసం పైలెట్ ప్రాజెక్టుగా 7 మండలాల నుంచి గతంలో ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ఫలితాల నివేదికలను రైతులకు అందించాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మినీ భూసార పరీక్షల కేంద్రాలు వినియోగంలో లేకపోవడంతో వారు ఆయా మట్టి నమూనాలను జడ్చర్ల సమీపంలోని ల్యాబరేటరికి పంపించి ఫలితాలను నామమాత్రంగా రైతులకు అందించారు.

భూసార పరీక్షలతో కలిగే లాభాలు..

రైతులు పంట పొలాలకు భూసార పరీక్షలు చేయడం వల్ల ఆయా పొలాలు ఏ పంటలకు అనుకూలంగా ఉంటాయో తెలుస్తుంది. వేసిన పంటలకు ఏయే ఎరువులను ఎంత మోతాదులో వాడాలో కూడా తెలుస్తుంది. రైతులు వేసిన పంటలకు అనవసరమైన ఎరువులను మాత్రమే వాడి ఆర్థికంగా నష్టపోకుండా చూసుకోవచ్చు. ముఖ్యంగా రైతులు పంట ఖర్చులను తగ్గించుకోవడంతో పాటుగా భూసారాన్ని అధికంగా పెంచుకోవచ్చు. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా అధిక దిగుబడులు పొందే అవకాశం దీనివల్ల ఎక్కువగా ఉంటుంది.

ఆయా మండలాలా వారీగా క్లస్టర్ల వివరాలు..

మండలం	క్లస్టర్లు
ఇటిక్యాల	12
మానవపాడు	07
అలంపూర్	05
ఉండవెల్లి	07
రాజోళి	06
వడ్డేపల్లి	05
అయిజ	11



షేకుపల్లిలో పరీక్ష కోసం మట్టిని తీస్తున్న రైతులు

రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



మండల కేంద్రాల్లో భూసార పరీక్ష కేంద్రాలు లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంటల సాగుకోసం మండలంలోని రైతులు పొలంలోని మట్టిని సేకరించి జడ్చర్ల ల్యాబ్‌కు పంపిస్తున్నారు. ఒక్కోసారి రిపోర్టులు సక్రమంగా రావడం లేదు. దీనివల్ల చాలా మంది రైతులు భూసార పరీక్షలను చేసుకోవడమే మానేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి క్లస్టర్లో తప్పకుండా భూసార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

– కుర్వ భీసన్న, రైతు, కారుపాకుల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



రైతులు భూసార పరీక్షలను మూడేళ్లకు ఒకసారి తప్పకుండా చేయించాలి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో మాత్రమే భూసార పరీక్ష కేంద్రం ఉంది. ప్రభుత్వం మినీ భూసార పరీక్ష కేంద్రాలను గతంలో మంజూరు చేసినా గదులు, విద్యుత్ వంటి సమస్యల కారణంగా అప్పట్లో సెంటర్లను ఏర్పాటు చేయలేకపోయాం. క్లస్టర్లలో భూసార పరీక్ష కేంద్రాల ఏర్పాటు గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే ప్రతి రైతు వేదికలలో భూసార పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– సక్రియ నాయక్, ఏడీఏ, అలంపూర్

మద్దతు ధర చట్టం తేవాలె



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న ధర్నాకు మద్దతుగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని క్రిష్ణవేణి చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రైతులకు రుణమాఫీ చేయాలని, ఫసల్ బీమా పథకాన్ని మార్చాలని, విద్యుత్ సవరణ బిల్లు 2020ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్లు టీపీఎఫ్ ప్రభాకర్, సత్యారెడ్డి, ఆశన్న, నాగరాజు, వినోద్ ఉన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు సన్మానం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరితను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, ఉరుకుందయ్య, సాయి ప్రకాష్, శ్రీనివాసులు, నాగరాజు, వాసు ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకుందామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్‌చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థలలో 1455 మంది ప్రజాప్రతినిధులు ఉన్నారని, అందులో సుమారు 900మంది ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారని, అందరు కలికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బలపర్చిన అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఎంపీపీలు, జెట్పీటీసీలు, ఎంపీటీసీలు, నేతలు గడ్డం కృష్ణారెడ్డి, జంబురామన్‌గౌడ్, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాల అర్బన్: పద్మశాలీల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని కొండలక్ష్మణ్ బాపూజీ చౌరస్తా వద్ద జిల్లా పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిపాటి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం పద్మశాలీల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు చిలువేరి సాయిబాబ, నామాల శ్రీకాంత్, అక్కల రమాదేవి, దామ వీరన్న, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

అయిజ: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను సకాలంలో నెరవేర్చుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందన్నారు. రూ.500కు గ్యాస్ సిలిండర్లు, మహిళలు ఉచిత బస్ ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలవుతుందన్నారు. మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, దేవరాజు, రాణెమ్మ, నాయకులు ఫిరోజ్, సాంబశివుడు, శాలి పైల్వాన్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో మండల కో ఆప్షన్ నెంబర్ మహ్మద్ సిరాజ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రామచంద్రరెడ్డి, శాంతన్న, ఖాజా, శేఖర్, విశ్వనాథ్‌నాయుడు, నరసింహులు, పరమేష్‌నాయుడు పాల్గొన్నారు.

అసమాన మేధో సంపన్నుడు కార్ల్‌మార్క్స్



అలంపూర్‌లో కార్ల్ మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అలంపూర్: అసమాన మేధో సంపన్నుడు కారల్ మార్క్స్ అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి నరసింహ అన్నారు. అలంపూర్ పట్టణంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో కారల్‌మార్క్స్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కారల్ మార్క్స్ అందించిన సేవలు రెండు యుగాలు మనుగడ సాధించడానికి స్ఫూర్తినిస్తాయన్నారు. శ్రమ దోపిడీ సమాజంలో అన్ని రకాల అసమానతలు, అణిచివేతలు, దురాచారాలకు మూలమని, దాని నిర్మూలనకు వర్గ పోరాటమే ఆయుధమని చెప్పిన మహనీయుడని కొనియాడారు. ప్రజల కష్టాలకు, కన్నీళ్లకు మూలం వేరే ఎక్కడో లేదని శ్రమ దోపిడేనని సమాజానికి చాటి చెప్పారన్నారు. సమాజ గతిని మార్చిన ఘనత కారల్ మార్క్స్‌కు దక్కుతుందన్నారు. సీపీఎం నాయకులు కె.నాగరాజు, ఆశన్న, మాలిక్, సిద్ధయ్య, ఏలీయా, రఫీక్, డ్రైవర్లు నరసింహ, నాయుడు, బాషా పాల్గొన్నారు.

దోపిడీదారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం

గద్వాల అర్బన్: దోపిడీదారి వ్యవస్థకు వ్యతిరేకంగా కార్ల్‌మార్క్స్ పోరాటం చేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మార్క్స్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తాను జీవించినంత కాలం దోపిడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహానుభావుడు కారల్‌మార్క్స్ అని కొనియాడారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థి ప్రణీత్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి ప్రణీత్ 68వ జూనియర్ నేషనల్ బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఏఎస్ నగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. గత నెలలో సేవక్‌తక్రా సబ్ జూనియర్ విభాగంలో నిర్వహించిన పోటీలలో 7వ తరగతి విద్యార్థులు నిఖిల్, విష్ణులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చి నేషనల్ టీమ్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలి



కేటీదొడ్డి: ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగర్‌కర్నూల్‌కు వస్తున్నారని భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు బల్గెర శివారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌కు మద్దతుగా ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సభకు బీజేపీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు హన్మిరెడ్డి, రాములు, సూర్యకాంత్ రెడ్డి, అశోక్, దేవేందర్‌రెడ్డి, రాముడు తదితరులు ఉన్నారు.

అయిజ: ఈనెల 16న నాగర్‌కర్నూల్‌లో ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మాదన్న, నరసింహయ్య శెట్టి, ఆంజనేయులు, భీమన్న ఉన్నారు.

మల్దకల్: బీజేపీ పటిష్టతకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మల్దకల్‌లో ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ నెల 16 నాగర్‌కర్నూల్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో దామ నాగరాజు, వీరన్నగౌడు, వెంకటేష్, గోకారి, గోపాల్‌రెడ్డి, దర్శెల్లి పాల్గొన్నారు.

ఆర్ఎస్‌పీ రాజకీయ సన్యాసం తీసుకోవాలి

డీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేష్



అలంపూర్ రూరల్: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజకీయ సన్యాసం తీసుకోవాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నరేష్, కిషోర్‌లు అన్నారు. అలంపూర్ పట్టణంలోని తెలంగాణ అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీ టికెట్ కోసం తెలంగాణలోని మూడున్నర కోట్ల బహుజనుల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ దగ్గర ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తాకట్టుపెట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్ర, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, మౌలాలి, భాస్కర్ ఉన్నారు.

పాఠశాలకు వంటపాత్రల వితరణ

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం నాయకులు దామోదర్‌రెడ్డి, పైల్వాన్‌లు పాఠశాలకు 50 కేజీల వంట సామగ్రిని వితరణ చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో వారికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు సహాయ, సహకారాలు ఎల్లప్పుడు అందిస్తామన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, యోగి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాతపాలెంలో వీడ్కోలు సమావేశం



పాతపాలెం వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో చదివి మంచి ఫలితాలు తెచ్చుకోవాలన్నారు. హెచ్ఎం పాగుంటన్న ఉపాధ్యాయులు రాజేశ్వరి, రాంబాబు, వెంకటేశ్వర్‌గౌడు, రాఘవ, పాండునాయక్, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, రియాజ్, రాజేష్, విద్యార్థులు ఉన్నారు.

ఉండవెల్లి: విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి కీలకమని ప్రధానోపాధ్యాయులు హేమలత అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. పదో తరగతి విద్యార్థులకు మాజీ సర్పంచ్ రేఖ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు జామెట్రీ బాక్సులు, పలు బహుమతులు అందజేశారు. వికోష్ రైల్వే ప్రాంభోత్సవానికి వెళ్లిన విద్యార్థులకు బహుతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, భరత్ కుమార్, మద్దిలేటి, మనోహర్ రెడ్డి, ప్రసన్న, అరుణ, అనిత, తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లి పాఠశాలలో నృత్యం చేస్తున్న పదో తరగతి విద్యార్థులు

మానవపాడు: పదో తరగతి విద్యార్థులు కృషి, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రమేష్‌గుప్త, కె.మద్దిలేటి, శ్రీధర్, మద్దిలేటి, రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసులు, లక్ష్మణ, శ్రీనివాస్‌రెడ్డి, రామ్మూర్తి, యోగి పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల తనిఖీ

మానవపాడు: మహిళా సంఘం సభ్యులను తప్పనిసరిగా ఉపాధిహామీ పనిలో 100 రోజులు పూర్తి చేసేలా ప్రోత్సాహించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నర్సింగరావు ఆదేశించారు. గురువారం మండలంలోని బోరవెల్లి, జల్లాపురం గ్రామాల్లో ఉపాధిహామీ పనులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 100 రోజులు ఉపాధిహామీ పనులు పూర్తి చేసిన కూలీ కుటుంబాలకు 'ఉన్నతి' అనే నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం 100 రోజులు పూర్తి అయిన కూలీ కుటుంబాలకు చదువుకున్న ఇతర కుటుంబ సభ్యులు శిక్షణ కార్యక్రమానికి అర్హులు అవుతారని తెలిపారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఏపీఓ విజయశంకర్, ఐకేపీ ఏపీఎం భీమన్న, ఉపాధిహామీ టీఏలు చెన్నకేశవులు, క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.



బోరవెల్లిలో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నర్సింగరావు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

గద్వాల: బ్రహ్మచెరువు–1 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలను బోధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు పాఠశాల ఎంఈఓ సురేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్, పాఠశాల హెచ్ఎం వెంకటయ్య, అనంతపురం హెచ్ఎం రమణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు హైమవతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని కాలూర్ తిమ్మన్‌దొడ్డి పాఠశాలలో గురువారం స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు సురేంద్ర, జయన్న, ప్రణీత, వీణ, జయరామ్ ఉన్నారు.

గట్టు: మండలంలోని ఇందువాసిలో గురువారం ఎంపీపీఎస్ విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు కుర్మయ్య, సంధ్య, శిరీష, నాగరాజు, ముంతాజ్‌బేగం, ఎంవీఎఫ్ వలంటీర్ నర్సింహులు పాల్గొన్నారు.

అయిజ: పులికల్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు.

18 ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కు కల్పించాలి

ఎర్రవల్లిచౌరస్తా: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించాలని తహసీల్దార్ నరేందర్ సూచించారు. గురువారం ఇటిక్యాల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఓటరు నమోదుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌వైజర్లు కలెక్టర్ ఇచ్చిన సర్క్యులర్ ఆధారంగా ఓటర్ల వివరాలు సేకరించాలన్నారు. బీఎల్‌ఓలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఓటు హక్కు లేని 18 నుంచి 19 సంవత్సరాల లోపు వారిని గుర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా ప్రతి రోజు వివరాలను స్థానిక సూపర్ వైజర్‌కు తెలియజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎర్రవల్లి తహసీల్దార్ నందిని, ఎస్ఓ అజిత్, ఆర్ఐలు, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు, తదితరులు ఉన్నారు.



ఓటరు నమోదుపై మాట్లాడుతున్న తహసీల్దార్